క్లుప్తంగా

భీమేశ్వరుని సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల అధికారి



భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న సాయిప్రసాద్ కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ కుటుంబ సమేతంగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీఓ పి.సింధుసుబ్రహ్మణ్యం, ఆర్డీఓ సీసీ బాలు, డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఆర్ఐ కర్రి మహాలక్ష్మినాయుడు, వీఆర్ఓ సాయిబాబు పాల్గొన్నారు.

3 నుంచి జగనన్న సురక్ష గ్రామ సభలు

కపిలేశ్వరపురం: జూలై 1న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను శుక్రవారం తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి వెల్లడించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి నాయకత్వంలోని బృందంలో డీటీ సీహెచ్.బాలాజీ సభ్యులుగా ఉంటారు. మరో బృందానికి తహసీల్దార్ కొమరం సూర్యారావు నాయకత్వం వహించబోతుండగా విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటారు. 3న వెదురుమూడి, 4న నేలటూరు, 5న అంగర-2 సచివాలయం, 6న వడ్లమూరు, 7న కాలేరులలో గ్రామ సభలు నిర్వహించనున్నారు. 10న అంగర-01 సచివాలయం, 11న టేకి, 12న పడమరఖండ్రిక, 13న వాకతిప్ప, 14న టేకి- 2 సచివాలయం, 15న కోరుమిల్లి- 01 సచివాలయం, 17న నల్లూరు, 18న కపిలేశ్వరపురం- 01 సచివాలయం, 19న మాచర, 20న తాతపూడి, 21న కోరుమిల్లి- 02 సచివాలయం, 22న వల్లూరు, 24న కపిలేశ్వరపురం-02 సచివాలయం, 25న అద్దంకివారిలంక, 26న కేదారిలంకలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ, తహసీల్దార్ తెలిపారు.

జగనన్న సురక్షను వినియోగించుకోండి

రాయవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి సూచించారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని కుటుంబాల్లోని పౌరులకు పౌర సేవల ధ్రువ పత్రాలు సకాలంలో అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం కూర్మాపురం, నదురుబాద గ్రామ పంచాయతీల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహించే కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దారు ఆధ్వర్యంలో రెండు బృందాలు సర్టిఫికెట్లను జారీ చేస్తాయన్నారు. పౌరులకు ధ్రువపత్రాలు అందించేందుకు రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, సర్వీస్ రిక్వెస్ట్, జేకేసీ డెస్క్‌లతో పాటుగా మెడికల్ క్యాంప్ ఆర్గనైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల్లోని పౌరులంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

కె.గంగవరం: రాజ్యాంగ విరుద్ధమైన ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, అరుణోదయ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి వి.భీమశంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధా తదితరులు డిమాండ్ చేశారు. మండలంలోని కె.గంగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు హక్కుల కోసం పోరాడుతున్న 152 మందిపై అక్రమంగా ఉపా దేశద్రోహ కేసును బనాయించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమాయకులపై ఉపా చట్టాన్ని అమలు చేసి దారుణంగా ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. వెంటనే ఉపా చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ తహసీల్దార్ వైద్యనాథ శర్మకు వినతి పత్రం అందించారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు అంబటి కృష్ణ, దళిత హక్కుల నాయకులు గుబ్బల శ్రీను, వి.రామకృష్ణ, కె.శేషయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూడికతో రైతులకు ఇక్కట్లు

మండపేట: పంట కాలువలు పూడికతో నిండిపోవడంతో సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని రామచంద్రుడు, నిడసనమెట్ట పంట కాలువలను శుక్రవారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన కాలువల్లో పూడికను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కూడా ఉన్నారు.

సచివాలయాలు .. సేవా నిలయాలు

రాయవరం మండలంలో..

- గ్రామ పంచాయతీలు: 12
- సచివాలయాలు: 19
- సచివాలయ ఉద్యోగులు: 147
- వలంటీర్లు: 406
- టీడీపీ హయాంలో వ్యవసాయ శాఖ సిబ్బంది : 4
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ సిబ్బంది : 12
- మండలంలో అన్ని రకాల పథకాల లబ్ధిదారుల సంఖ్య: 70,153
- లబ్ధిదారులకు అన్ని రకాల పథకాల ద్వారా పొందిన లబ్ధి: రూ.179,30,92,642
- మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య: 9,803
- ఒక నెలకు మండలంలో పింఛన్‌దారులకు లబ్ధి: రూ.2,63,78,900



గ్రామ సచివాలయం

- పల్లెల్లోనే అందుబాటులో సకల సేవలు
- గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన సర్కారు

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారు. గ్రామాలు కేంద్రాలుగా పాలన సాగిస్తున్నారు. పల్లె సీమలే రాష్ట్ర ప్రగతికి పట్టుకొమ్మలు అన్న మహాత్మా గాంధీ నినాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిజం చేసి చూపిస్తోంది. గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిటకు తీసుకుని వచ్చింది. అన్ని రకాల ప్రభుత్వ సేవలనూ ఒక చోట అందించి, పాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో ఇప్పుడు దేశం యావత్తూ ఏపీ వైపు చూస్తోంది. నాణ్యమైన పాలన అందిస్తూ..అవినీతికి తావులేని సత్వర సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ప్రజలకు సేవల ద్వారా నూరు శాతం సంతృప్తి స్థాయిని పెంచారు. గతంలో ప్రతి పనికి మండల కేంద్రాలకు వెళ్లవలసి వచ్చేది. గ్రామ పాలన ద్వారా ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గాయి. గ్రామాల్లో ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చే పరిస్థితిని ప్రభుత్వం తీసుకుని వచ్చింది. అలాగే పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ప్రతి సంక్షేమ పథకం లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తోంది.

సొంతూరులోనే సేవలు

ప్రతి సంక్షేమ కార్యక్రమం వారి నివాసం ఉంటున్న గ్రామాల్లోనే అందించేలా అదే గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, విలేజ్ పోలీసు, సచివాలయ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇలా సచివాలయంల 10 శాఖలకు చెందిన 10 మంది సచివాలయ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటూ అందిస్తున్న సేవల పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అందుతున్న సేవలివే

సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించి అనేక రకాల సేవలను ప్రజలకు నేరుగా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పింఛన్ల పంపిణీ, అందరికీ ఇళ్లు, జగనన్న చేదోడు, చేయూత, రేషన్ కార్డులు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఇళ్లు, భూముల సర్వే, ఆస్తుల కొనుగోళ్లు, అమ్మకాల రిజిస్ట్రేషన్ ఇలా 545 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు.

గర్వపడేలా పాలన



ప్రజాప్రతినిధులు గ్రామాల్లోకి ధైర్యంగా వెళ్లి ప్రభుత్వ పాలన గురించి చెప్పే విధంగా పాలనను తీర్చిదిద్దారు. ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత పెరిగింది. ప్రజాప్రతినిధులు గర్వపడే పరిస్థితిని ప్రభుత్వం తీసుకుని వచ్చింది.

– ఆరిఫ్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, సోమేశ్వరం

సంతృప్తి స్థాయి పెరిగింది



ప్రభుత్వం మెరుగైన పాలన ద్వారా ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగింది. ఏ ధ్రువపత్రం కావాలన్నా గ్రామాల్లో ఉన్న సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. కిలోమీటర్ల దూరం వెళ్లి మండలాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా పాలనను ప్రజల వద్దకే తీసుకుని వచ్చారు.

– నౌడు వెంకటరమణ, ఎంపీపీ, రాయవరం

జగనన్న లే అవుట్ల పరిశీలన



జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్

రాయవరం: మండలంలోని మాచవరం, చెల్లూరు గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరెడ్డిలతో కలిసి లే అవుట్లను పరిశీలించి, లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. వారి వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు, లబ్ధిదారులు హాజరయ్యారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

రాయవరం: లొల్ల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ–2 వై.సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ తెలుగు, ఇంగ్లిషులలో చదవడం, రాయడం రావాలన్నారు. అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల విద్యాస్థాయిని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు తయారు చేసి, పాఠశాలలో ప్రదర్శించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు యూనిఫామ్, షూ ధరించి వచ్చేటట్లుగా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డికి సూచించారు.

డంపింగ్ యార్డు సమస్యకు తెర

- ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిల్
- దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించారని హర్షం
- నెల రోజుల్లో స్థలసేకరణ – కమిషనర్



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న కౌన్సిలర్లు

మండపేట: దశాబ్ద కాలంగా పట్టణాన్ని పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో తెరపడింది. నెల రోజుల్లో స్థల సేకరణ ప్రక్రియ పూర్తికానున్నట్టు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. అందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాల్లో జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండా అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు. అనంతరం అత్యవసర సమావేశంలో ఆలమూరు రోడ్డులోని రావులగొయ్యి చెరువును మూడేళ్ల కాల పరిమితిపై ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీకి రెన్యువల్ చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అవకాశం

అనంతరం కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మండపేట పట్టణాన్ని ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యను ఎమ్మెల్సీ తోట ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించారన్నారు. స్థల యజమానులను ఒప్పించి కోర్టు కేసులు విత్ డ్రా చేయించడం ద్వారా స్థల సేకరణకు మార్గం సుగమం చేశారన్నారు. దీనివలన పట్టణంలో మరింత మెరుగైన పారిశుధ్య నిర్వహణకు వీలు పడుతుందని కౌన్సిలర్లు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుత డంపింగ్ యార్డు చాలక గతంలో వర్షాకాలంలో అక్కడికి చెత్త తరలించుకునేందుకు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చేదని, దీర్ఘకాలం పాటు పట్టణ పారిశుధ్య నిర్వహణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎమ్మెల్సీ తోట పరిష్కారం చూపారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు చైర్‌పర్సన్ దుర్గారాణి, వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

నెల రోజుల్లో స్థలసేకరణ పూర్తి

డంపింగ్ యార్డు స్థలసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత డంపింగ్ యార్డు ఆనుకుని ఉన్న 2.75 ఎకరాల స్థలాన్ని సేకరణ కోసం మున్సిపాల్టీ నుంచి పదేళ్ల క్రితమే రెవెన్యూ శాఖకు రూ. 1.2 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువను అనుసరించి ఇటీవల కౌన్సిల్ చేసిన తీర్మానం మేరకు అదనంగా రూ. 2.14 కోట్లు రెవెన్యూశాఖకు చెల్లించామన్నారు. నెల రోజుల్లో స్థలసేకరణ పూర్తవుతుందని కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- 12వ వార్డులో పర్యటన



12వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: వర్షాకాలం ప్రవేశించిన దృష్ట్యా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. అందులో భాగంగా వార్డు పర్యటనలు నిర్వహిస్తూ సమస్యలు గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మితో కలిసి శుక్రవారం ఆ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పారిశుధ్య నిర్వహణపై ప్రజలతో మాట్లాడారు. స్థానికులు చెప్పిన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించేందుకు వార్డు పర్యటనలు దోహదం చేస్తాయన్నారు. సమస్యలు ఉంటే తెలియజేసి పరిష్కారానికి సహకరించాలని చైర్‌పర్సన్ దుర్గారాణి కోరారు. వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు అలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, అమలదాసు లక్ష్మి, పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు తాడి రామారావు, ముక్కా దాలయ్య, పెంకే గంగాధర్, మొండి మురళీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

పట్టణంలోని 27, 28 వార్డులకు సంబంధించి 13వ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యలు పరిష్కరించడం ద్వారా అంధత్వ నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో జగన్ సర్కార్ రికార్డ్

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సోమేశ్వరంలో గడప గడపకూ..



సోమేశ్వరం గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ రికార్డు సృష్టించిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సోమేశ్వరంలో శుక్రవారం నాల్గవ రోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఆరిఫ్, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, కోట వెంకట్రావులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ దేశంలో ఇంత వరకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్క నాయకుడూ 50 శాతం కూడా నెరవేర్చలేదన్నారు. కాని ప్రజలకిచ్చిన వాగ్దానాలను పవిత్రంగా భావించి 97 శాతం నెరవేర్చిన ఒకే ఒక్క నాయకుడు సీఎం జగన్ మాత్రమే అన్నారు. ప్రతి గ్రామంలో సమస్యలు గుర్తించి, వాటిని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు ఏ కారణం చేతనైనా అందకపోతే వారికి కూడా ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గ్రామంలో అడుగడుగునా ప్రజలు త్రిమూర్తులుకు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు రాయవరంలో..

మండలంలోని రాయవరంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు.

గడప గడపనూ విజయవంతం చేయండి

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రులో శనివారం జరగనున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు విజయవంతం చేయాలని ఎంపీపీ మాత భారతి అన్నారు. శుక్రవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుంచి జరుగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ తదితర నాయకులు గ్రామంలో ఇంటింట పర్యటించి ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరిస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ విధిగా హాజరు కావాలన్నారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా మండల గ్రామాల్లో జూలై ఒకటి నుంచి జరగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అండ్రంగిలో శనివారం ఉదయం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. నెల రోజుల పాటు మండల గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. 11 రకాల ధ్రువపత్రాలను ఈ కార్యక్రమంలో ఉచితంగా అందజేస్తామన్నారు.

నేడు కొత్తూరులో..

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలో 1వ సచివాలయం వద్ద నేడు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

- పాల్గొన్న మంత్రి వేణు తనయుడు నరేన్



కుయ్యేరులో స్థానికులకు అందిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణు తనయుడు నరేన్ తదితరులు

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ అన్నారు. మండలంలోని కుయ్యేరులో నరేన్, ఎంపీపీ మాత భారతి తదితరులు శుక్రవారం గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, ఎంపీటీసీ చీకట్ల సత్యనారాయణల ఆధ్వర్యంలో వలంటీర్లు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రతి ఒక్కరికీ వివరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ నూరుశాతం అమలు చేయడంతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నికల్లో ప్రకటించిన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, పార్టీ నాయకులు యాళ్ళ సత్తిబాబు, టేకుమూడి దుర్గారావు, మేకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పాలవెల్లువ'ను విజయవంతం చేయండి



రాయవరంలో నూతనంగా ఏర్పాటైన మహిళా డెయిరీ అసోసియేషన్

రాయవరం: జగనన్న పాలవెల్లువ పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ మహిళా రైతులను కోరారు. రాయవరంలో శుక్రవారం మహిళా డెయిరీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి మాట్లాడుతూ మహిళా పాడి రైతులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం మహిళా డెయిరీ అసోసియేషన్‌ను సెంటర్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో 48 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. సమావేశంలో మహిళా డెయిరీ అసోసియేషన్‌కు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చీఫ్ ప్రమోటర్‌గా కర్రి సోమరత్నం, ప్రమోటర్‌గా దేవిశెట్టి సూర్యలక్ష్మి ఎన్నికయ్యారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, వైఎస్సార్ సీపీ నేతలు తాడి రామచంద్రారెడ్డి, పడాల కమలారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎ.నాగశ్రావణి, రూట్ ఆఫీసర్ బి.రత్నకుమార్ పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో జగనన్న పాల వెల్లువలో భాగంగా అమూల్ సంస్థ సహకారంతో మహిళా సహకార పాల డెయిరీ సంఘాన్ని 11 మంది సభ్యులతో శుక్రవారం ఏర్పాటు చేసి, అవగాహన సమావేశం నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున మాట్లాడుతూ మహిళా రైతులు ఆర్థికంగా ఎదిగే విధంగా జగనన్న పాలవెల్లువ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు, రూట్ ఇన్‌చార్జి జవహర్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ భాస్కరలక్ష్మి, వీఆర్ఓ రామకృష్ణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలుదారు పత్రాలు లేకుండానే రైతులకు రుణాలు

రామచంద్రపురం రూరల్: పండిస్తున్న పంటలకు రుణాలు పొందడంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచనల మేరకు రామచంద్రపురం మండలం కందులపాలెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు ఏవో ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కందులపాలెంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ గ్రామంలో కౌలు ఎటువంటి కౌలుదారుల పత్రాలు అవసరం లేకుండానే పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతులు అదే గ్రామంలో గత 5 సంవత్సరాలుగా నివాసం ఉంటూ బ్యాంకు రుణాల చెల్లింపులో సక్రమంగా ఉన్నవారికి రైతుల నుంచి కౌలుదారుల కార్డులు తీసుకోవాల్సిన అవసరం లేకుండానే రుణాలు ఇవ్వడం జరుగుతుందని డీసీసీబీ బ్యాంకు మేనేజర్ రాము తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గీసాల జగదీశ్వరరావు(శివ), పెంకే వీర్రాఘవులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపే కీలకం

కె.గంగవరం: కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేస్తే అంగవైకల్యానికి గురికాకుండా ఉంటారని జిల్లా డిప్యూటీ పారామెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అముజూరు, పామర్రుల్లో జరుగుతున్న పరిశీలనలో ఆయన పాల్గొన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. గ్రామాల్లో ఈ నెల 26వ తేదీ నుంచి జులై 16వ తేదీ వరకు గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని ఎవరికైనా స్పర్శ లేకపోయిన, రంగుమారిన, పాలిపోయిన మచ్చలు ఉన్నా వెంటనే ఆరోగ్య సిబ్బందికి చూపించి పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. పామర్రు పీహెచ్‌సీ పరిధిలో గుర్తించిన 15 మందికి ఆయన స్వయంగా పరీక్షించి ఒకరికి ఆరు నెలలు మందులు అందించారు. వైద్యాధికారి పార్వతి, సూపర్‌వైజర్ మల్లికార్జునుడు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.